మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

## రెండో అపర భద్రాదిగా...

- శిర్సనగండ్ల శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయం
- ఈ నెల 6న రాములోరి కళ్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- నేడే మాస కళ్యాణం

3



### సన్న బియ్యం పంపిణీ చేయాలా

# రెడ్డి సాబ్ రావాలి

### అనధికారికంగా డీలర్లకు రెవెన్యూ అధికారుల ఆదేశాలు



మాల్కియాన్‌పల్లి గ్రామంలో రేషన్ బియ్యం కోసం ఎదురుచూస్తున్న గ్రామస్తులు

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 4 ప్రభాత వార్త :** మండలంలో సన్న బియ్యం పంపిణీ చేయాలంటే రెడ్డి సాబ్ రావాలని అనధికారికంగా రెవెన్యూ అధికారులు స్థానిక బియ్యం డీలర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన విధంగా ఉగాది పండుగ నుండి తెల్ల రేషన్ కార్డు ఉన్న నిరుపేద లబ్ధిదారులకు రేషన్ కార్డుకు ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈనెల రెండవ తేదీన వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మండల కేంద్రంలోని రెండవ చౌక ధరల దుకాణం ఆవరణలో సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు అడిషనల్ కలెక్టర్ తో పాటు ఆర్డిఓ తహశీల్దార్ అధికారులు పాల్గొన్నారు. గ్రామాలలో యధావిధిగా సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వంతోపాటు ఉన్నత స్థాయి అధికారులు మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలా కాకుండా మండలానికి చెందిన కొందరు అధికార పార్టీకి సంబంధించిన నాయకులు ఒక టీం గా ఏర్పడి మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న రేషన్ షాప్ డీలర్లు తామువచ్చి పంపిణీ చేసే వరకు సన్న బియ్యం పంపిణీ చేయవద్దని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పలు గ్రామాలలో ఇప్పటివంకు రేషన్ డీలర్లు సన్న బియ్యం పంపిణీ చేయలేదు. సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారని ఆదేశాలతో రేషన్ షాపుల వద్దకు వెళ్లిన నిరుపేదలు డీలర్ షాపులు మూసి ఉండడంతో అవాక్కయ్యారు. స్థానిక డీలర్లకు ఫోన్లు చేసి అడగడంతో అధికార పార్టీకి చెందిన నాయకులు బియ్యం పంపిణీ మా ఆధ్వర్యంలో జరగాలని ఆపాలని చెప్పారు అని చెప్పారు. తహశీల్దార్ సుగుణను అడగడంతో అనధికారికంగా ఎవరికి బియ్యం పంపిణీ ఆదేశాలు జారీ చేయలేదని ఎమ్మెల్యే మేఘారెడ్డి మండల కేంద్రంలో ప్రారంభించారు. మిగతా గ్రామాలలో అన్ని షాపులకు చెందిన రేషన్ షాప్ డీలర్లు వెంటనే సన్న బియ్యం పంపిణీ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పిటిసి, జిల్లా పరిషత్ చైర్మన్ అన్ని రకాల స్థానిక సంస్థల పదవీకాలం ముగిసింది అని మరి మండల స్థాయి రెవెన్యూ అధికారులకు తెలువకుండా అధికార పార్టీ నాయకులు సన్న బియ్యం ఎలా నిలిపివేస్తారని ఆయా గ్రామాలకు చెందిన గ్రామస్తులు అధికారులను నిలదీస్తున్నారు. జిల్లా అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు కల్పించుకుని అన్ని గ్రామాలలో సన్న బియ్యం పంపిణీ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### ధరూర్ పోలీస్ స్టేషన్ నూతన భవనానికి

# భూమి పూజ చేసిన రాష్ట్ర డిజిపి



నూతన పోలీస్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన డిజిపి జితేందర్, ఎమ్మెల్యే, చైర్మన్ గురునాథ్ రెడ్డి

**గద్వాల, ఏప్రిల్ 4 ప్రభాత వార్త :** అత్యాధునిక హంగులతో ధరూర్ మండల పోలీస్ స్టేషన్ నూతన బిల్డింగ్ నిర్మాణంను త్వరలో పూర్తి చేసి ప్రజా సేవల నిమిత్తం అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని రాష్ట్ర డిజిపి డా. జితేందర్ అన్నారు. ధరూర్ పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి శుక్రవారం డీజీపీ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్ రెడ్డి, గద్వాల్ ఎమ్మెల్యే బి.కృష్ణ మోహన్ రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఏం.రమేష్, మల్టీ జోన్-2 ఐజిపి వి.సత్యనారాయణ, జోగుళాంబ జోన్ -7 , డిఐ జి ఎల్.ఎస్. చౌహాన్, జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు ఐపీఎస్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఈ ఈ వై.బి.శ్రీనివాస రావుల తో కలిసి భూమి పూజ నిర్వహించి, శంకుస్థాపన శిల పలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ అత్యాధునిక హంగు లతో ధరూర్ మండల కేంద్రం లో పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని 2 కోట్ల 65 లక్షలతో నిర్మించడం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించి నేడు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలందరికీ పోలీస్ స్టేషన్ అందుబాటులో ఉండి, పారదర్శకంగా సత్వర సేవలు అందించేలా పోలీస్ శాఖ కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ధరూర్ మండలం కేంద్రంలో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చెయ్యడం అభినందనీయమన్నారు. ధరూర్ మండల ప్రజల 30 ఏళ్ల కల నెరవేరబోతుందన్నారు. పోలీస్ స్టేషన్ వెళ్లాలంటే డ్యాం దగ్గరికి వెళ్ళవలసిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ నేటితో ఆ సమస్యను పరిష్కరించడం మండల కేంద్రంలోనే పోలీస్ స్టేషన్ నిర్మాణంకు భూమి పూజ చేయడం జరిగిందన్నారు. త్వరలోనే ప్రజలకు అందుబాటులో పోలీస్ స్టేషన్ ఏర్పాటు కావడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని గద్వాల్ టౌన్ లో మరో పోలీస్ స్టేషన్ ఏర్పాటు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, కేటీ దొడ్డి పోలీస్ స్టేషన్ నిర్మాణం, సర్కిల్ కార్యాలయాన్ని అప్ గ్రేడ్ చెయ్యడం గురించి ఎమ్మెల్యే డీజీపీ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్పి వై.మొగిలయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, గద్వాల్ సిఐ టంగుటూరి శ్రీను, ధరూర్ ఎస్సై శ్రీహరి, హౌసింగ్ కార్పొరేషన్ ఏ.ఈ అనీల్ శాస్త్రి, ఆయా పోలీస్ స్టేషన్ ల ఎస్సైలు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్లకు..

# లంచం ఇవ్వద్దు

- నిరుపేదల కడుపు నింపడానికి సన్న బియ్యం
- దేశంలో ఎక్కడా లేనివిధంగా సన్నబియ్యం పంపిణీ
- రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన బిఆర్ఎస్
- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**మహబూబ్‌నగర్ బ్యూరో,పానుగల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** సన్న బువ్వతో పేదోడి కడుపు నింపాలనే సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా పానగల్ మండలంలోని రేమద్దుల,కిష్టాపూర్, గోపాల్ పూర్, అన్నారం గ్రామాల్లో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణనే. అంతేకాకుండా సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చి రైతులకు ప్రోత్సాహం ఇవ్వడంలో ప్రభుత్వం ముందు వరుసలో నిలిచిందని తెలిపారు. వేల కోట్ల రూపాయల సబ్సిడీ భరిస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా ఇప్పటి వరకు పంపిణీ చేస్తున్న బియ్యం దుర్వినియోగం అవుతున్నట్లు ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. దొడ్డు బియ్యాన్ని తినేందుకు ఇష్టపడని పేద, మధ్యతరగతి వర్గాలు పెద్ద సంఖ్యలో రేషన్ దుకాణాల నుంచి తీసుకున్న బియ్యాన్ని ఆ సమీపంలోనే దళారులకు విక్రయించడం, లేదంటే డీలర్ల నుంచి అసలు బియ్యం తీసుకోకుండా అతను ఇచ్చిన మొత్తం తీసుకుని వెళ్లడం జరిగేదని వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన ఏడాది కాలంలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తుందని చెప్పారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ కింద పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే సిలిండర్, రెండు పంటలకు ఏడాదికి రూ. 12,000 రైతు భరోసా రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, తదితర ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖునే జీతాలు చెల్లిస్తున్నామని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగ నియామకాలను క్రమం తప్పకుండా చేపడుతున్నామని పేర్కొన్నారు. రుణమాఫీ కానీ వారు, 200 వ యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రూ. 500 కే సిలిండర్ రాయితీ రాని అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం అధికారులకు లంచం ఇవ్వవద్దని కోరారు. కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజల ఆశీస్సుల వల్లే సుదీర్ఘ కాలం ప్రజా సేవలో ఉన్నానని, ఎన్ని జన్మలు ఎత్తినా మీ రుణం తీర్చుకోలేనిదని అన్నారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్ ఇన్చార్జి) యాదయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి విశ్వనాథ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పనులను

# పరిశీలించిన కలెక్టర్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

**నారాయణపేట టౌన్,ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** నారాయణపేట మండలంలోని అప్పక్ పల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో కూలీలు చేస్తున్న కమతాల పనులను చూసి, ఎన్ని రోజుల నుంచి పని చేస్తున్నారని, రోజుకు ఎంత కూలీ పడుతుందని కూలీలను అడిగి తెలుసుకున్నారు. రోజూ ఎన్ని గంటలకు పనికి వస్తున్నారని, ఎన్ని సార్లు హాజరు తీసుకుంటున్నారని ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగారు. అయితే ఉదయం 7గంటలకు వచ్చి మధ్యాహ్నం 12 వరకు పని చేస్తామని కూలీలు కలెక్టర్‌కు తెలిపారు. ఉపాధికూలీలకు ఏర్పాటుచేసిన టెంట్,నీటి వసతినీ ఆమె చూశారు. గతఏడాది ఎన్ని రోజులు ఉపాధి పనులు చేశారని అక్కడి కూలీలతో ఆరా తీశారు. అప్పక్ పల్లిలో దేవమ్మ అనే మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, గత ఫిబ్రవరి 21న సీఎం రేవంత్ రెడ్డి ఆ ఇంటి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే శుక్రవారం కలెక్టర్ సీఎం శంకుస్థాపన చేసిన ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయించాలని పంచాయతీ కార్యదర్శికి ఆమె సూచించారు. అలాగే గ్రామంలో మరో ఇద్దరు షమీబేగం,ఆశాబేగంల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. షమీ బేగం ఇంటి నిర్మాణ ఇంకా బేస్ మెంట్ పూర్తి కాక పోగా,ఆశా బేగం ఇంటి నిర్మాణం బేస్ మెంట్ పూర్తి అయింది. ఆయా నిర్మాణ పనులను చూసిన కలెక్టర్ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తే దశల వారీగా ఇంటి నిర్మాణానికి డబ్బు విడుదల అవుతుందని లబ్ధిదారులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుదర్శన్, ఏపీవో, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

**కూలీలకు వందరోజుల పని కల్పించాలి :** ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు వందరోజుల పని కల్పించి, రోజుకు రూ.300 లకు పైగా కూలీ డబ్బు వచ్చేలా పనులు చేయించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలి

- రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి...
- వేసవి నేపథ్యంలో త్రాగునీటి ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖలు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి..

నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూలు ప్రతినిధి,ఏప్రిల్4 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూలు జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని అదనపు కలెక్టర్లు దేవ సహాయం, అమరేందర్, ఎంపీడీవోలు,మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ అధికారులు,జిల్లాఅధికారులతో ఇందిరమ్మఇల్లు,రాజీవ్ యువవికాసం, త్రాగునీటిపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్షసమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ దారిద్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని 400నుండి 500 స్క్వేర్ ఫీట్‌లోపు ప్రభుత్వ సూచనల కనుగుణంగా ఇల్లు నిర్మించుకునేందుకు జిల్లాలో నియోజకవర్గానికి 3,500ఇందిరమ్మఇండ్లు నిర్మించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా జిల్లాలో 861మందికి ఇందిరమ్మఇళ్లు మంజూరయ్యాయని, వారందరినీ ఇల్లు కట్టుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనర్హులకు ఇందిరమ్మఇళ్లు మంజూరు కాకుండా చూడాలని, అర్హులైన – మిగతా3లో..

### రాజీవ్ యువ వికాసం పథకాన్ని

# సద్వినియోగం చేసుకోవాలి

### రాష్ట్ర ఆబ్కారీ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆబ్కారీ పర్యాటక సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం కొల్లాపూర్ నియోజకవర్గం లోని పానగల్ మండలంలో రైతు వేదికలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండలంలోని అర్హులైన 40మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, ఒక షాది ముబారక్ చెక్కులను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్‌యువవికాసం పేరుతో ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల ద్వారా పథకం అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆయా వర్గాల జనాభా ప్రాతిపదికన జిల్లాలు,మున్సిపాలిటీలు,మండలాలకు యూనిట్లు కేటాయిస్తారనీ రూ.50వేల వరకు ఖర్చయ్యే యూనిట్లకుప్రభుత్వం వందశాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. రూ.50వేల – మిగతా3లో..

- మూడేళ్లుకాదు ముప్పయ్యేళ్లయినా అధికారం రాదు
- పందికొక్కుల్లా మెక్కారు.. దోచుకుని రాష్ట్రాన్ని అప్పుల పాల్జేశారు
- గోప్లాపూర్‌లో బీఆర్ఎస్‌పై ఎమ్మెల్యే జీఎంఆర్ విమర్శనాస్త్రాలు

# బీఆర్ఎస్‌వి పగటికలలు



గోప్లాపూర్‌లో మాట్లాడుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్,ఏప్రిల్ 4,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిందని,బీఆర్ఎస్ నాయకులు పందికొక్కుల్లా మెక్కి,దొరికినకాడికి దోచుకున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే,మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) విమర్శించారు. శుక్రవారం భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మూడోవార్డు గోప్లాపూర్‌లో బీపీఎల్ కార్డ్ హోల్డర్లకు రేషన్‌షాపుల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో మహిళలు, గ్రామ ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే జీఎంఆర్ మాటాడుతూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోషల్ మీడియాలో మాట్లాడుతూ పథకాలు అమలు చేయలేని చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వమని పేర్కొంటూ,మూడేళ్లు ఆగితే తమ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని,అప్పుడు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్ఎస్ నాయకులవి కేవలం పగటి కలలని ఎమ్మెల్యే జీఎంఆర్ ఎద్దేవా చేశారు. వారనుకున్నట్లు మూడేళ్లు కాదు ముప్పయేళ్లయినా బీఆర్ఎస్ అధికారంలోకి రాదని ఎమ్మెల్యే జీఎంఆర్ స్పష్టం చేశారు. లేనిపోని గొప్పలకు పోయి గత బీఆర్ఎస్ ప్రభుత్వ భ్రష్టంపై ఏడు లక్షల కోట్ల అప్పులు మిగిల్చిందని,బీఆర్ఎస్ చేసిన అప్పులకు నెలనెలా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు కడుతోందని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినప్పటికి పేదోడు మూడు పూటలా సన్న బియ్యంతో కడుపునిండా భోంచేయాలన్నదే సీఎం రేవంతరెడ్డి ఆలోచనని అన్నారు. తమ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అంచెలంచెలుగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. సీఎం పాలమూరు జిల్లా ముద్దుబిడ్డ కాబట్టి జిల్లా ప్రజల ఆకలికేకలు,కరువు పరిస్థితి క్షుణ్ణంగా సీఎం రేవంత్‌రెడ్డికి తెలుసునని,పాలమూరు జిల్లా అభివృద్ధికి ఏటా కోట్ల రూపాయల ప్రత్యేక నిధులు కేటాయిస్తూ వెనకబడిన పాలమూరు జిల్లాను అభివృద్ధి పథంలోకి నడిపేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా ఏ రాష్ట్రంలో లేనివిధంగా పేదలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్,కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లిక్కివిజయ్‌కుమార్‌గౌడ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి,మండల కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు జైదు శ్రీనివాసులు,మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్,మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షుడు పదమ్మతో పాటు కాంగ్రెస్ నాయకులు బోరింగ్ నర్సింహులు,గడ్డం ఎల్లప్ప, బజార్ పరుశురాం,జమీర్, మునిస్వామి,మాజీ ఎంపిటీసీ సభ్యుడు లాలూ నాయక్,మేకల వేణుగోపాల్,లక్ష్మారెడ్డి,కొండన్న,తిరుపతిరెడ్డి,రాంరెడ్డి, మాసగౌడ్,కిట్టురెడ్డి,వడ్డె శ్రీనివాసులు,టీవీ రెడ్డి, వెంకటేష్,మణ్యం,రేషన్ డీలర్ జానకిరాములు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో గోప్లాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఎమ్మెల్యే జీఎంఆర్‌ను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేతో కలిసి గోప్లాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు.

# నేతన్నలను పట్టించుకోని కాంగ్రెస్

### మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్



నేతన్నలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** నేతన్నల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో చేనేత కార్మికుల గృహాలను ఆయన సందర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కులవృత్తులు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని అన్నారు. నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. చేనేత కార్మికులకు విద్యుత్ బిల్లులు పెను శాపంగా మారాయని అన్నారు. ఆదుకోవాల్సిన అధికార పార్టీ నాయకులు కార్మికుల ఆత్మ స్థైర్యం దెబ్బ తీసేవిధంగా మాట్లాడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో చేనేత కార్మికులను పూర్తి స్థాయిలో ఆదుకున్నట్లు చెప్పారు. నేత కార్మికుల రుణాలు మాఫీ చేయాలనీ కోరారు. అంతకంటే ముందు కార్మికుల కుటుంబాలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి వెంట తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ ఉన్నారు.

# కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ

### కొనసాగుతున్న స్టీల్ వ్యర్థ పదార్థాల తొలగింపు

### నిరంతరాయంగా కొనసాగుతున్న మట్టి తవ్వకాలు, డి వాటరింగ్ ప్రక్రియ



ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శివశంకర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బిసి టన్నెల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఎస్ఎల్‌బిసి, టన్నెల్ లోపల జరుగుతున్న సహాయక చర్యలపై సహాయక బృందాల ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి శివశంకర్ నిత్యం సమీక్షిస్తున్నారు. ఈసందర్భంగా ఆయన శుక్రవారంమీడియాతో మాట్లాడారు. సహాయక బృందాలు తమకు కేటాయించిన పనిని పూర్తి స్థాయిలో చేపడుతూ సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. టన్నెల్ లోపల అత్యధికంగా పేరుకుపోయిన స్టీలును లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నట్లు వివరించారు. టన్నెల్ లోపల 24 గంటల పాటు 5 ఎస్కావేటర్లు స్టీలు భాగాలను, ప్రమాద ప్రదేశంలో భారీగా ఉన్న రాళ్లను లోకో ట్రైన్ ప్లాట్ ఫామ్ పైకి తరలిస్తూ, మట్టి తవ్వకాలు చేపడుతూ 100 మీటర్ల వరకు పునరుద్ధరించిన కన్వేయర్ బెల్టు ద్వారా మట్టి, బురదను, బయటకు తరలిస్తున్నట్లు తెలియజేశారు. టన్నెల్ లోపల ఉన్న ఊటనీటిని నిరంతరం బయటకు పంపింగ్ చేస్తున్నట్లు తెలియజేశారు. సహాయక బృందాలకు అవసరమైన వసతులను కల్పిస్తూ, ఆహారం, ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ సహాయక చర్యల పురోగతిపై ప్రతి రోజూ సమీక్ష సమావేశం నిర్వహిస్తూ, సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో, ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, సింగరేణి మైన్స్ రిస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎస్ డి ఆర్ ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్, నీటిపారుదల శాఖ డిఈ శ్రీనివాసులు, జిఎస్ ఐ అధికారులు రాజ్ కుమార్, జెపి కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న మక్తల్ ఎమ్మెల్యే


కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**ఆత్మకూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి శ్రీ సత్యనారాయణ స్వామి నాగదేవత విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమానికి మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందింప చేసుకుని ఒకరికి ఒకరు చేదోడువాదోడుగా కలిసిమెలిసి జీవించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. భక్తి భావాన్ని పెంపొందించుకుంటేనే సుఖశాంతులతో ప్రతి ఒక్కరం జీవించగలుగుతామని ఆయన విజ్ఞప్తి చేశారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో నిర్వాహకులు ప్రతినిత్యం సేవా కార్యక్రమాలు కొనసాగించడం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి ఆలయ అర్చకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కల్వరాజు శెట్టి, రమేష్ శెట్టి ,గోవర్ధన్ శెట్టి తదితరులతో పాటుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాధర్ గౌడ్, తులసిరాజు యాదవ్, రహమతుల్లా ,పరమేష్, నల్లగొండ శ్రీనివాసులు, మనివర్ధన్ రెడ్డి తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెబ్బేరు మాంటిస్సోరి ప్లేవే స్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవం

**పెబ్బేరు,ఏప్రిల్4 ప్రభాతవార్త:**పెబ్బేరుపట్టణంలో మాంటిస్సోరి ప్లేవే స్కూల్ పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది.ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ దాదాపుగా 120మంది విద్యార్థినీ,విద్యార్థులంతా ఉపాధ్యాయులుగా ఒకరోజు తమ విధులను నిర్వర్తించి గొప్ప అనుభూతిని పొందడం జరిగింది. అని విద్యార్థులను కొనియాడడం జరిగింది. నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దడం ఒక్క ఉపాధ్యాయుడికి మాత్రమే సాధ్యమైనటువంటిది ఈ ఉపాధ్యాయ వృత్తి అని మాట్లాడటం జరిగింది. శుక్రవారం విధులు నిర్వహించిన విద్యార్థులు కూడా మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది కఠినమైనది కూడా అని వారు చెప్పడం జరిగింది. శుక్రవారం కలెక్టర్‌గా సింధు, డిప్యూటీ కలెక్టర్గా సాహితి, జిల్లా విద్యాధికారిగా వసంత,మండలవిద్యాధికారిగా ప్రణీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గా లావణ్య, టీచర్లుగా, పిఈటిలుగా విధులు నిర్వహించడం జరిగింది. ఈ స్కూలు ఉపాధ్యాయులు శివ యాదవ్, ఎల్ల స్వామి, రాఘవేందర్, భాష, శాజు, అనురాధ, వరలక్ష్మి, శ్రీ సుష్మ, చంద్రకళ, రేణుక, షైబి, గాయత్రి ,హాసిని కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## యువత డ్రగ్స్‌కు బానిస కావద్దు



గోడపత్రిక విడుదల చేస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** యువత డ్రగ్స్‌కు బానిస కావద్దని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నారాయణ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా మక్తల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహనకు సంబంధించిన గోడపత్రికను శుక్రవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు బానిస కావడంతో మత్తులో వారు అవాంఛనీయ సంఘటనలకు పాల్పడడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యువత తప్పుదారి పట్టకుండా దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వాడితే వచ్చే పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల నిషేధానికి కట్టుబడి ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యాంటీ డ్రగ్స్ కమిటీ కన్వీనర్ హరిశ్చంద్ర, కమిటీ మెంబర్స్ తిరుపతి, రాజేశ్వరి, అధ్యాపకులు రమేష్ గౌడ్, జహంగీర్, లింగప్ప, బాలరాజ్, లక్ష్మీకాంత్, నర్సోజి, మహేష్, సులోచన, నాగేంద్రమ్మ, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాలాపూర్‌లో పేదలకు సన్న బియ్యం పంపిణీ


సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**మూసాపేట్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** మండలంలోని నిజాలాపూర్ గ్రామంలో శుక్రవారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి పేదలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం నిజాలాపూర్ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ వి. రామచంద్రర్ మాట్లాడుతూ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మేలు జరుగుతుందని అన్నారు. ప్రతి కుటుంబానికి ఉచిత కరెంటు సబ్సిడీ సిలిండర్ ఉచిత బస్సు ఇలా ఒక్కొక్క పథకం ఇచ్చిన మాట ప్రకారం నెరవేరుస్తూ ప్రజలకు మేలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గోవర్ధన్, మాజీ సర్పంచ్ మురళీధర్ గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు, పల్లె గంగాపురి, మద్దిగట్ల రాములు. విట్టల్ శీను. రమేష్, అంజి, బాలరాజు, ప్రకాష్, టైలర్ రాములు, రఘుపతి, రామచంద్రయ్య, డీలర్ శ్రీనివాసులు ఇతర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉల్లి రైతుకు అండగా ఉంటాం

### మక్తల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జి. రాధా లక్ష్మారెడ్డి


ఉల్లి కొనుగోలును ప్రారంభించిన దృశ్యం

**మక్తల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** మక్తల్ పరిసర ప్రాంతాల్లో ఉల్లి పంటను సాగుచేసిన రైతాంగానికి అండగా ఉంటామని మక్తల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జి. రాధా లక్ష్మారెడ్డి అన్నారు. మక్తల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ఉల్లి కొనుగోళ్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉల్లి రైతులు గతంలో తమ పంటను విక్రయించేందుకుగాను దేవరకద్ర,రాయిచూరు,ఇతర ప్రాం తాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడే వార న్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని స్థానిక మార్కెట్ యార్డ్ లో వ్యాపారస్తులతో చర్చలు జరిపి ఇక్కడే ఉల్లి కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవడం జరిగింద న్నారు. రైతులంతా తమ పంటను ఇక్కడే విక్రయించి సొమ్ము చేసుకోవాలని ఆమె కోరారు. కాగా క్వింటాలు ఉల్లి ధర కనిష్టంగా రూ.900 గరిష్టంగా రూ.1200 వరకు పలికినట్లు మార్కెట్ అధికా రులు తెలిపారు.

## ఉచిత కంటి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**మక్తల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి, కందూరు రామ్ రెడ్డి కంటి ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ కంటిచూపును మెరుగుపరుచుకోవాలని మక్తల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.గణేష్ కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. మక్తల్ మండలంలోని భూత్పూర్ లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో ఇప్పటికే పెద్ద ఎత్తున ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించి, కంటిచూపు లోపంతో బాధపడుతున్న వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించడంతో పాటు మందులు, కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. దశల వారీగా అన్ని గ్రామాల్లోనూ శిబిరాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామానికి చెందిన మొత్తం 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 35 మంది కంటి పొరలలో లోపం ఉన్నట్లు గుర్తించి వారిని శస్త్ర చికిత్సల నిమిత్తం మహబూబ్ నగర్ కు తరలించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కట్ట సురేష్, కుర్మయ్య గౌడ్, రఘుపతి రెడ్డి, భీం సేన్ రావు, చెన్నయ్య గౌడ్, నూరుద్దీన్, హస్ముద్దీన్, బోయ నరసింహ, కంటి వైద్య సిబ్బంది ప్రమోద్, సత్యం గౌడ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులకు మించిన దైవం లేదు



**ఉట్కూరు,ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ముగ్దుంపూర్ గ్రామ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రులకు విద్యార్థులు పాద పూజ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శివరాజ్ మాట్లాడుతూ తల్లిదండ్రులను మించిన దైవం లేదు, తల్లిదండ్రులను సేవించడం ద్వారా మనకు పుణ్య ఫలం లభిస్తుంది అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు,ప్రధానోపాధ్యాయుడు శివరాజ్,ఆదర్శ పాఠశాలకమిటీ చైర్మన్ సత్యమ్మ,ఉపాధ్యాయులు మహేష్, నర్మద, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఇక నుంచి ప్రతి నెల సన్న బియ్యం


ఇందిరమ్మ నమూనా గృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్


రేషన్ షాపులో స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

## రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఎంపీడీఓ ఆఫీస్‌లో ప్రత్యేక కౌంటర్

## ఇందిరమ్మ నమూనా గృహాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**పెబ్బేరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన వారి నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించేందుకు ఎంపీడీఓ కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం పెబ్బేరు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారులు వేగంగా గ్రౌండ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన వారి నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించేందుకు ఎంపీడీఓ కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న ఇందిరమ్మ నమూనా గృహాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ నెలాఖరులోపు నిర్మాణాన్ని పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ విభాగం డిఈ విఠోబాకు సూచించారు.

**ఇకనుంచి ప్రతి నెల నాణ్యమైన సన్న బియ్యం**

పేదలకు నాణ్యమైన సన్న బియ్యం అందించాలనే ఉద్దేశంతోనే, ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. పెబ్బేరు మండల కేంద్రంలోని మూడవ నెంబర్ రేషన్ దుకాణాన్ని సందర్శించి, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రేషన్ దుకాణంలో ఉన్న స్టాక్ రిజిస్టర్, బియ్యం పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. బియ్యం తీసుకోవడానికి వచ్చిన స్థానికులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సన్న బియ్యంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇకనుంచి ప్రతి నెల తెల్ల రేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. తహశీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ రవీంద్ర, ఎంపీఓ రోజా ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# రైతును రాజుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం


ఆత్మకూరులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**ఆత్మకూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా రైతులకు అన్ని రకాల సదుపాయాలు సమకూర్చి రైతును రాజుగా మార్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేస్తుందని మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయ ఆవరణలో సీజన్ కు సంబంధించి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు రైతులను నిర్లక్ష్యం చేయడం మూలంగానే రైతులు ఆకమ్య గోచర పరిస్థితులను ఎదుర్కొన్నారని కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేయడమే కాకుండా రైతు భరోసాను ఐదువేల నుండి 7000 రూపాయలకు పెంచిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని ఆయన అన్నారు. గత ఖరీఫ్ సీజన్ మాదిరిగానే ప్రస్తుత రవి సీజన్లో కూడా వరి ధాన్యం క్వింటాలకు రూపాయలు 500 బోనస్ చెల్లించేందుకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రైతులు రాజులుగా మారే అవకాశం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. రవి సీజన్లో రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ ఆయకట్టు రైతులు నీరు అందుతాయో లేదో అని అనుమానం పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నాయకుల బృందం కర్ణాటక ప్రభుత్వాన్ని ఒప్పించి నీటి విడుదల చేయించి రైతులను ఆదుకున్న ఘనత తమకే దక్కుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి ,కార్యదర్శి నరేష్ ,తహశీల్దార్ చాంద్ పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాధర్ గౌడ్ ,రహమతుల్లా ,పరమేష్, తులసిరాజు యాదవ్ ,నల్లగొండ శ్రీనివాసులు, దామోదర్ తదితరతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రంలో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**పెబ్బేరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మడానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం పెబ్బేరు మండల పరిధిలోని కంచిరావుపల్లి గ్రామ రైతువేదికలో పిఏసిఎస్, ఐకెపి పీపీసీ నిర్వాహకులకు ధాన్యం కొనుగోలు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మడానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. రైతుల కోసం కొనుగోలు కేంద్రంలో టెంట్ , తాగునీరు, కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిరోజు తప్పక రిజిస్టర్ నిర్వహించాలని, రైతులు ధాన్యం తెచ్చినప్పుడు తేమ ఎంత ఉంది అనే విషయాలను అందులో రాయాలని సూచించారు. సన్న రకం వరి ధాన్యాన్ని గుర్తించడంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్ లు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వం సన్నాలకు రూ. 500 బోనస్ కల్పిస్తున్న నేపథ్యంలో ధాన్యాన్ని గుర్తించడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ డిజిటల్ గ్రేయిన్ కాలిబర్ మీటర్ ను తీసుకొని ధాన్యాన్ని గుర్తించడం నేర్చుకోవాలని చెప్పారు. సన్న రకం వరి ధాన్యానికి, దొడ్డు రకానికి వేరువేరుగా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత మిల్లుకు పంపిన వెంటనే ట్రక్ షీట్ తెప్పించుకొని రైతులకు వేగంగా నగదు చేరే విధంగా పనిచేయాలన్నారు. అసలైన సన్నాలు వేసిన రైతులు నష్టపోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే ఏఈఓ లను సంప్రదించలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శిక్షణకు వచ్చిన పిపిసి నిర్వాహకులను కొందరిని పిలిచి వారికి ఇంత మేరా అర్థమైంది అనే విషయాన్ని పరీక్షించి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు నాయక్, జిల్లా సహకార అధికారి ప్రసాదరావు, తహశీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ రవీంద్ర, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు పడక గదులకు వాడుతున్న ఇసుకను పరిశీలించిన రెవెన్యూ అధికారులు


ఫిల్టర్ ఇసుకను పరిశీలిస్తున్న మండల తహసీల్దార్ అధికారులు

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మామిడి మాడ గ్రామంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు అయిన రెండు పడక గదుల నిర్మాణము అసంపూర్తిగా మిగిలిపోయింది. ఇటీవల స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడంతో స్లాబ్ లేవల్ వరకు బిల్లు కాంట్రాక్టర్‌కు మంజూరు అయింది. దీంతో మిగతా పనులు కూడా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. స్థానిక నేరేడు చెరువులో అక్రమంగా గత ఏడాది పాటుగా ఇసుకను ఫిల్టర్ చేసి అక్రమార్కులు అమ్ముతున్నారు. రెండు పడక గదుల కు కూడా ఇదే ఇసుకను స్థానిక కాంట్రాక్టర్ సరఫరా చేసి రెండు పడక గదుల నిర్మాణం మొదలుపెట్టారు. స్థానికంగా ఉన్నటువంటి కొంత మంది యువకులు ఎమ్మార్వోకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఎమ్మార్వోతో పాటు పిఆర్ఏఈ రమేష్ నాయుడు ఇతర అధికారులు రెండు పడకగదులకు వినియోగిస్తున్న ఫిల్టర్ ఇసుకను పరిశీలించారు. ఫిల్టర్ ఇసుక తయారుచేసి అక్రమ రవాణా చేయడం నేరమని ఫిల్టర్ ఇసుకను తయారు చేసే వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సుగుణ తెలిపారు. రెండు పడకగదులకు నాణ్యమైన ఇసుకను సరఫరా చేస్తామని ఆమె చెప్పారు.

## పోతులమడుగులో స్కూల్ అటెండర్ ఆనంద్‌కు ఘన సన్మానం

**భూత్పూర్,ఏప్రిల్ 4,ప్రభాతవార్త :** పోతులమడుగు జెడ్పీహెచ్ఎస్‌లో నాలుగు దశాబ్దాలకు పైగా సబార్డిరేట్(అటెండర్) పోగుల ఆనంద్ విధులు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ పొందారు.శుక్రవారం పాఠశాల యాజమాన్యం ఆనంద్‌కు పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పాఠశాల గజిటెడ్ హెచ్ఎం,ప్రస్తుత భూత్పూర్ మండల విద్యాధికారిణి ఉషారాణితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, పలు పార్టీలకు చెందిన నాయకులు, గ్రామస్తులు శాలువలు,పూల మాలలతో ఘనంగా సన్మానించారు. అటెండర్‌గా పాఠశాలలో ఆనంద్ ఒనర్చిన సేవల్ని పలువురు కొనియాడారు.పాఠశాల ఉపాధ్యాయుడు పదవి విరమణ చేసిన ఆనంద్ సన్మాన పత్రాన్ని చదివి వినిపించారు.సన్మాన కార్యక్ర మంలో మాజీ సర్పంచి మనెమోని సత్యనారాయణ,సీనియర్ పాత్రికేయుడు శంకర్ ఇతర గ్రామస్తులు ఆనంద్ సేవల్ని కొనియాడారు.

## విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే


విద్యార్థులను సన్మానిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే

**ఆత్మకూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని ఒట్లంపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగవ తరగతి విద్యను అభ్యసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించినటువంటి గురుకుల ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 319వ ర్యాంకులు సాధించిన వై అజిత్ కుమార్‌తో పాటుగా గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన రైను స్త్రీలను మొత్తం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించినటువంటి ప్రతిభా పరీక్షా పోటీలలో ఉత్తీర్ణత సాధించడమే కాకుండా మంచి ర్యాంకులు సాధించడం పట్ల ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## జెడ్పీహెచ్ఎస్‌లో వార్షికోత్సవ వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడి
- అలరించిన పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు


పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్,ఏప్రిల్ 4,ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది.ఈ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) హాజరయ్యారు.వార్షికోత్సంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.ముఖ్యంగా చిన్నారులు ప్రదర్శించిన శివతత్వ భరతనాట్య గీతం 'భరతవేదమున' అనే నృత్యగీతం ప్రేక్షకుల్ని అమితంగా ఆకట్టుకుంది.చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన పాఠశాల హెచ ఎం ఆనందమ్మతో పాటు ఉపాధ్యాయులు రేవతి తదితరులను ఎమ్మెల్యే జీఎంఆర్ అభినందించారు.ఎమ్మెల్యే వెంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్,పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులున్నారు.

# నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకం

### తెలంగాణ రాష్ట్ర డిజిపి, డాక్టర్ జితేందర్ ఐపీఎస్


మస్తీపూర్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్


జూరాల ప్రాజెక్టు దగ్గర అవుట్ పోలీస్ చెక్పోస్టు భవనం నిర్మాణానికి భూమి పూజ

**అమరచింత, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని తెలంగాణ రాష్ట్ర డిజిపి, డాక్టర్ జితేందర్ అన్నారు. శుక్రవారం అమరచింత మండలంలోని మస్తీపూర్ గ్రామంలో నేను సైతం పిలుపులో భాగంగా గ్రామవాసి ఐజి రమేష్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో 46 అధునాతన సీసీ కెమెరాలను తెలంగాణ రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే, డాక్టర్ వాకిటి శ్రీహరి తో కలిసి ఆయన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి, డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ, ప్రజలు తమ వ్యక్తిగత భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన పోలీసులకు తెలుస్తుందని ఆయన అన్నారు. సీసీ కెమెరాలకు జిపిఎస్ కనెక్టు చేయడం వల్ల అమరచింత మస్తీపూర్ నుండి జిల్లా కమాండ్‌కంట్రోల్‌కు హైదరాబాద్ కంట్రోల్‌కి అనుసంధానం చేసి వీక్షించడానికి అవకాశం ఉం టుందని ఆయన తెలిపారు. అలాగే నేరాలను అదుపు చేయడానికి చైనా,లండన్ దేశాలలో 100 డయల్ పోలీసులు అమలుచేసి నేరాలను అదుపు చేశారని చైనా లండన్ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలోని 100డయల్ అమలు చేయ డంతో నేరాలను అదుపులోకి తీసుకొచ్చామని ఆయన తెలిపారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని సీసీ కెమెరాలు 24 గంటలు నిరంతరం పనిచేస్తాయని ఆయన తెలిపారు. జిల్లాలో నేరాలను అదుపు చేయడానికి పోలీసులతో పాటు ప్రజలను స్వచ్ఛంద సంస్థలను వ్యాపారస్తులను భాగస్వామ్యం చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. అలాగే అమరచింత మండలానికి నూతన పోలీస్ భవనం ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. అలాగే జూరాల ప్రాజెక్టు దగ్గర కోటి, 50 లక్షలు నిధులతో పోలీస్ అవుట్ చెక్ పోస్ట భవన నిర్మాణానికి రాష్ట్ర డిజిపి, డాక్టర్ జితేందర్, మక్తల్ ఎమ్మెల్యే, డాక్టర్ వాకిటి శ్రీహరితో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, ఐజి రమేష్ రెడ్డి, జోగులంబ జోన్ డిఐజి, ఎల్ ఎస్ చౌహాన్, మల్టీ జోన్ ఐజి సత్యనారాయణ, వనపర్తి జిల్లా ఎస్పీ, రావుల గిరిధర్, వనపర్తి జిల్లా ఏఆర్ అదనపు ఎస్పి, వీరారెడ్డి, వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వర్లు, ఆత్మకూరు సిఐ శివకుమార్, అమరచింత ఎస్సై, సురేష్ వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## జిల్లాలో సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుంది

■నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూలు ప్రతినిధి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** పేద కుటుంబాలకు చెందిన వారు కూడా నాణ్యమైన సన్నబియ్యంతో కూడిన భోజనం చేయాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఉచితంగా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సన్నబియ్యం పంపిణీపై సమీక్ష నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లా వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ పి.అమరేందర్, పౌర సరఫరాల శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సుమారు 13వేల కోట్ల రూపాయల భారం పడుతున్నప్పటికీ, పేద కుటుంబాల కోసం ఈ పథకాన్ని చేపట్టిందని అన్నారు. ఈ పథకం ద్వారా ఆహార భద్రతను ఆచరణాత్మక రూపంలో కల్పించినట్లు అయ్యిందని, రాష్ట్రంలోని సుమారు 80 నుండి 84 శాతం మంది నిరుపేదలకు ఉచితంగా సన్నబియ్యం అందుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దీని ఔన్నత్యాన్ని గుర్తిస్తూ అన్ని జిల్లాలో ప్రతిరోజ సజావుగా సన్న బియ్యం పంపిణీ జరిగేలా అంకిత భావంతో కృషి చేయాలని, ప్రజా ప్రతినిధులతో కలిసి పంపిణీ ప్రక్రియ కొనసాగించాలని, సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాలలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించినట్లు, జిల్లాలోని 558 రేషన్ షాపులలో 2,43,107 రేషన్ కార్డులు ఉన్నాయని, వాటికి 4946.455 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం కేటాయింపులు అయ్యాయని, ఆదివారం వరకు వంద శాతం అన్ని రేషన్ షాపులలో స్టాక్ ఉండేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. రేషన్ షాపుల దగ్గర సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొనాలని జరిగిందని, సన్న బియ్యం అందుకున్న ప్రజలు సంతోషం వ్యక్తం చేశారని మంత్రికి జిల్లా కలెక్టర్ వివరించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఇండ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎవరైనా ఉన్నట్లయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అధికారులు ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి అన్ని వివరాలను పూర్తి స్థాయిలో అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో త్రాగునీటి సరఫరాకు ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వేసవికాలం యాక్షన్ ప్లాన్ ప్రకారం మున్సిపల్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఎంపీడీవోలు గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ప్రణాళిక సిద్ధం చేసుకుని ప్రజలకు త్రాగునీరు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. త్రాగునీరు సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి స్థానికంగా ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యువతకు, యువకుల కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకం ద్వారా జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు, నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు సమర్పించాలని సూచించారు. రాజీవ్ యువ వికాస పథకానికి క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించి అందరికీ తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్సిపల్ కార్యాలయాలు, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాలు, ప్రదేశాలలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయిలో సర్టిఫికెట్ల జారీలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు పూర్తి గైడ్ చేయుటకు సిబ్బంది నియమించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

నుంచి రూ.లక్ష వ్యయంతో కూడిన ప్రాజెక్టులకు 90 శాతం సబ్సిడీ 10 శాతం బ్యాంకు రుణం ఉంటుందని, రెండులక్షల వరకు 80 శాతం, 4 లక్షల వరకు ఉన్న యూనిట్లకు 70 శాతం సబ్సిడీ ఇచ్చి మిగిలిన 30శాతం బ్యాంకు రుణాల ద్వారా గ్రౌండింగ్ చేయడం జరుగుతుందని తెలియజేశారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు ఇవ్వడం, ఇచ్చిన గ్యారంటీలు అమలు చేయడం జరుగుతుందని తెలియజేశారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని ఎస్సీ, ఎస్టీ, బి.సి. మైనారిటీస్, ఈ డబ్ల్యూఎస్ నిరుద్యోగులు సకాలంలో దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసిల్దార్ సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీఓ గోవింద రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, ఇతర ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణ కోసం స్థల పరిశీలన

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** వనపర్తి పట్టణం రాజపేట శివారులోని 73/2 సర్వే నెంబర్‌లో గల ఎకరం స్థలంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని నిర్మించనున్నట్లు వనపర్తి శాసనసభ్యులుతూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు, దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డితో కలిసి వనపర్తి శాసన సభ్యులు మేఘారెడ్డి స్థల పరిశీలన చేశారు. స్థలాన్ని పరిశీలించిన మంత్రి జిల్లా పార్టీ కార్యాలయ నిర్మాణానికి స్థలం చాలా అనుకూలంగా ఉందని వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డికి సూచించారు. ఈ పార్టీ కార్యాలయం నిర్మాణంతో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు ఎంతగానో అణువుగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, పట్టణ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా

● పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం పంపిణీ : దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

**చిన్న చింతకుంట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతానని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో పలు రేషన్ దుకాణాలలో సన్న బియ్యం పంపిణీ, జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రేషన్ షాప్1లో సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గతంలో ఈ మండలం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధిని విస్మరించారని నేను ఈ మండలానికి చెందిన వ్యక్తిగా ఈ మండల అభివృద్ధికి కంకణ బద్ధులై పని చేస్తానని అని తెలిపారు. నిరుపేదల కడుపు నింపేందుకే సన్నబియ్యాన్ని అందిస్తున్నామన్నారు. దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారా చెప్పాలని ఆయన ప్రశ్నించారు.దేశంలోనే సన్న బియ్యాన్ని అందించే రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనన్నారు.ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే తాటతీస్తామని ఆయన హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండల కేంద్రంలో 61 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.పాలమూరు తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు.110 కోట్ల రూపాయలతో ఎలిమినేటర్ కారిడార్, కొండపైకి ఘాట్ రోడ్ నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.మరింత అభివృద్ధి చేసేందుకు 60 కోట్ల పనుల గాను ప్రతిపాదనలను పంపించినట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో శ్రీ కురుమూర్తి స్వామి ఆలయ అభివృద్ధి మరిచారని ఆయన దుయ్యబట్టారు.అంతకుముందు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని, రాజ్యాంగ పుస్తకాన్ని చేత పట్టుకుని పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు.ఈ కార్యక్రమంలో దేవరకద్ర మార్కెట్ చైర్మన్ కథలప్ప, విండో చైర్మన్లు సురేందర్ రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, నాయకులు వెంకటేష్, వట్టెం శివకుమార్, వెంకటేష్, తెలుగు వెంకటేష్, మహమూద్, కృష్ణ కుమార్ రెడ్డి ,ఫారూఖ్, శ్రీనివాస్ గౌడ్, శేఖర్ ,ప్రతాప్ ,దామోదర్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాబ్ మేళతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశం

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** జాబ్ మేళాతో నిరుద్యోగులకు ఉపాధి అవకాసం పొందవచ్చునని సేవా భారతి విభాగ్ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం నారాయణపేట సేవా భారతి పాలమూరు మరియు చిట్టెం నర్సిరెడ్డి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఉద్యోగమేళాలో ఇన్ఫోసిస్ నిర్మాణ్ సంస్థ వారు ఒలెక్ట్రా కంపెనీ, ట్రై జియో,స్కై కాడ్,హిమ ల్యాబ్, మాతృ భూమి, తదితర కంపెనీలు పాల్గొని దాదాపు 104 విద్యార్థులకు ఇంటర్వ్యూ నిర్వహించనైనదని 150 మంది పాల్గొన్నారని నిర్వాహకులు సేవా భారతి విభాగ్ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.కళాశాల ప్రిన్సిపల్ డా. మెర్సి వసంత మాట్లాడుతూ జాబ్ మేళా నారాయణపేట లాంటి ప్రాంతాల నిరుద్యోగులకు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా భారతి జిల్లా అధ్యక్షులు రాందేవ్ రెడ్డి సీనియర్ లెక్చరర్ రంగారెడ్డి డా. కృష్ణారెడ్డి,అడ్వకేట్ రామచందర్, సత్యనారాయణ గౌడ్, సురేష్ సుజాత్ అలీ, నిర్మాణ్ సంస్థ నుండి నవత, శరత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలి

**ఉప్పునుంతల, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** మండలంలోని కొరటికల్ గ్రామంలో డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు సిహెచ్ సుధాకర్ కోరారు. భారతదేశంలో సామాజిక న్యాయం, సమానత్వం, మానవ హక్కుల కోసం చేసిన పోరాటం ద్వారా అద్భుతమైన మార్గదర్శకత్వాన్ని అందించారన్నారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం ఆ సమాజంలో మార్పు తీసుకురావడానికి ఒక సంకేతం అన్నారు.

## రెండో అపర భద్రాదిగా..

## శిర్సనగండ్ల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం

◆ఈ నెల 6న రాములోరి కళ్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

◆వేలాదిగా తరలిరానున్న భక్తులు ◆నేడే మాస కళ్యాణం



ఆలయ ముఖ ద్వారం

**వంగూరు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో రెండో అపరభద్రాదిగా చారకొండ మండలం శిర్సనగండ్ల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రఖ్యాత ఉంది. హిందువులు జరుపుకునే పండుగలలో శ్రీరామనవమి పండుగ ఎంతో విశిష్టమైనది. శ్రీరామనవమి అంటే శ్రీరాముడి జన్మదినం, శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం ఒకే రోజు కావడంతో ఈ పండుగను వాడ వాడన ఎంతో ఘనంగా జరుపుకుంటారు. అదే సందర్భంలో అపర భద్రాదిగా పేరొందిన శిర్సనగండ్ల గుట్టపై శ్రీసీతారాముల కళ్యాణం లక్షలాది భక్తుల మధ్య వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహిస్తారు. చైత్రశుద్ధ అష్టమి నుంచి చతర్ధశి వరకు జరిగే ఉత్సవాల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు. చారకొండ మండల కేంద్రం నుంచి శిర్సనగండ్ల శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం 7కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. బుధవారం నుంచి వారం రోజుల పాటు అంగరంగా వైభవంగా కన్నుల పండువగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం శిర్సనగండ్ల గుట్ట. 60 ఎకరాల్లో విశాలమైన భూమిలో ఆలయం విస్తరించి ఉంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా నల్గొండ, హైదరాబాద్, రంగారెడ్డిలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి లక్షలాది భక్తులు పాల్గొని స్వామి వారి కళ్యాణోత్సవాన్ని తిలకించి మొక్కులు తీర్చుకుంటారు. శ్రీరామనవమి రోజు భద్రాచలంలో జరిగే కళ్యాణం ముహుర్తానికి శిర్సనగండ్ల గుట్టపై ప్రభుత్వ లాంఛనలతో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహిస్తారు.



ఆలయ చరిత్ర...

క్రీ.శ. 13వ శతాబ్దంలో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు శిలాశాసనాలు తెలుపుతున్నాయి. దట్టమైన అరణ్యంలో గుట్టపై దత్తాత్రేయ ఆశ్రమం, ముత్యాలమ్మ ఆలయం ఉండేది. శిర్సనగండ్ల గ్రామానికి చెందిన దేరం రామయాజ్వీ అనే ఉపాధ్యాయుడికి కలలో దర్శనమిచ్చిన రాముల వారు భద్రాచలంలోని పాల్వంచ సమీపంలోని రావిచేడు గ్రామంలో భాస్కరుడు అనే పురోహితుడు ఇంటి పెరటి భాగంలో కాకర పాదు క్రింద సీతారామచంద్రస్వామి విగ్రహాలను దాచినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది.ఆ విగ్రహాలను భద్రాచలంలో ప్రతిష్టించాల్సి ఉన్నప్పటికి సకాలంలో అక్కడికి చేరుకోకపోవడంతో వేరే విగ్రహాలను ప్రతిష్టించారు. కోడి కూత, రోకటి మోత వినిపించని ప్రశాంతమైన శిర్సనగండ్ల గుట్టపై ఆలయాన్ని నిర్మించి విగ్రహాలను ప్రతిష్టించమని ఆజ్ఞాపించారు. శ్రీరాముడి స్వప్న సందేశం మేరకు పాల్వంచ సమీపంలోని రావిచేడు గ్రామంలో భూస్థాపితంగా ఉన్న రామలక్ష్మణ సీత సమేతుడైన విగ్రహాలతో హన్మంతుడి విగ్రహాన్ని బయటకు తీసి శిర్సన గండ్ల గుట్టపై ప్రతిష్టించారు. ఆ తర్వాత శాతావాహనులు 1591లో ముఖ మండప నిర్మాణం చేసినట్లు శిలాశాసనంలో తెలుపబడింది. దత్తాత్రేయ ముని స్వయంగా శాస్త్రోత్తకంగా సీతా రామలక్ష్మణ హనుమాన్ విగ్రహాలను ప్రతిష్టించారని పూర్వీకులు చెబుతున్నారు.

ఉత్సవాల వివరాలు..

శనివారం స్వామి వారి మాస కళ్యాణం, ధ్వజా పథకం, అరోహణ, అభిషేకం, అలంకరణ, మహానివేధన, మహానిరాజనం, తీర్థప్రసాద వితరణ, ఎదుర్కొళ్లు, పల్లకిసేవ నిర్వహించబడును. ఈనెల 06న ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు దివ్యమైన ముహుర్తంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం జరుపగా గరుఢసేవ, రాత్రికి చిన్న రథం(పూలతేరు), 07న సోమవారం వేద పారాయణం, కుంకుమార్చన, 08న మంగళవారం శివదత్తాత్రయ, పరుశరామ అమ్మ వారి ఆలయంలో ప్రత్యేక అర్చనాదాలు, రాత్రికి ప్రదోషరాజోపచారములు, 09న బుధవారం



శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం

తెల్లవారుజామున పెద్ద రథం(బ్రహ్మోత్సవం), 10న గురువారం ఉదయం అభిషేకం, అర్చనలు, నాగబలి పూర్ణాహుతి (దోపోత్సవం), 11న శుక్రవారం పల్లకిసేవ, అభిషేకం, చక్రతీర్థం, ద్వాదశారధన, రాత్రి స్వామి వారికి ఏకాంత సేవ, 12న శనివారం శివదత్తాత్రేయ, పరుశరామ, పోచమ్మ అమ్మవారి దేవాలయాల్లో అర్చనాదాలు, సంకీర్తనలు నిర్వహించనున్నట్లు దేరం రామశర్మ, ఆలయ ఈఓ నిరంజన్‌లు తెలిపారు.

ప్రత్యేక బస్సులు...

శిర్సనగండ్ల శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్వకుర్తి, దేవరకొండ, అచ్చంపేట డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ దేరం రామశర్మ తెలిపారు. అదే విధంగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లను చేసి తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్రహ్మోత్సవాలకు మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాతో పాటు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కల్వకుర్తి డీఎస్పీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో శాంతి భద్రతాలకు విఘాతం కలుగకుండా గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. శుక్రవారం సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు.

## కళ్యాణ లక్ష్మి పేరింటి ఆడబిడ్డలకు వరం

-ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌పథకం పేదింటి ఆడబిడ్డలకు వరం లాంటిదని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నాగర్ కర్నూల్ టౌన్, మండలం, తెల్కపల్లి మండలంకు సంబంధించి 150 కళ్యాణ్ లక్ష్మి, షాది ముబారక్, 46 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ కళ్యాణాలక్ష్మి, షాది ముబారక్ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే సంక్షేమ పరిపాలనకు నిదర్శనమన్నారు. పేద కుటుంబాల్లో అమ్మాయిల పెళ్లిళ్లు, తల్లిదండ్రులకు భారం కాకూడదు. ఈ పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు, ప్రతి అమ్మాయి జీవితాన్ని వెలుగులు నింపేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే ప్రధానం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాలను అందించే బాధ్యత అధికారులు లేదేనని ఎవరైనా పథకానికి దూరంగాఉంటే,వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజలకు ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబా లకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులుఈ సందర్భంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, జిల్లాయూత్ కాంగ్రెస్‌అధ్యక్షులు కొత్తపల్లి వినోద్‌కుమార్, ప్రజా ప్రతినిధులు, వివిధ మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, వివిధ గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, యువ జననాయకులు, మహిళ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పదు

●వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



పదవి విరమణ పొందిన శివారెడ్డి దంపతులను సన్మానించిన ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ ఎప్పటికైనా తప్పదని పదవీ విరమణ అనంతరం వారి అనుభవాలను ప్రజాసేవకు అంకితమయ్యేలా చూడాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి పట్టణం బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న శివారెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి హాజరై పదవి విరమణ పొందిన శివారెడ్డి దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు శివారెడ్డి గత 35ఏళ్లుగా పరిచయమని, పదవి విరమణ పొందిన తర్వాత ఆయన సేవలు ప్రజాసేవకు కేటాయించాలని ఎమ్మెల్యే సూచించారు. నవ సమాజ స్థాపనలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని అలాంటి ఉపాధ్యాయులు రాజకీయాల్లోకి వస్తే ప్రజా ప్రయోజన సమాజాన్ని నిర్మించవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**అలంపూర్, ఏప్రిల్4 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బుడమొర్సు గ్రామానికి చెందిన మహేంద్ర 24 గురువారం పిడుగు పాటు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్ బాధిత కుటుంబానికి అండగా ఉండాలని స్థానిక నాయకులకు సూచించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పరామర్శించిన వారిలో అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్, జిల్లా మహిళా నాయకురాలు నాగసురోమని, దేవేంద్ర తదితరులు ఉన్నారు.

## బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడుగా జె.నరేందర్ రెడ్డి ఎన్నిక

**కల్వకుర్తి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** కల్వకుర్తి బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా జే.నరేందర్ రెడ్డి విజయం సాధించారు. బార్ అసోసియేషన్‌కు ఎన్నికలో జాయింట్ సెక్రెటరీ బి.మల్లేష్ యాదవ్ ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్ జయంతు కుమార్, జనరల్ సెక్రెటరీగా ఎస్.మల్లేష్, ట్రెజరర్‌గా కే.అంజనేయులు, లైబ్రరీనిగాబి.ప్రశాంత్, ప్రెస్‌సెక్రటరీగా ఏ.రాంగోపాల్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన అధ్యక్షులు జే.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూఅందరి సహకారంతో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన భవన కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని,న్యాయవాదుల సమస్యలకు పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు కే వెంకటరమణ, సీనియర్ న్యాయవాదులు జి.వెంకట్ గౌడ్, లక్ష్మీనారాయణ, భాస్కర్‌రెడ్డి, సి.కృష్ణయ్య, ఎజీపీలు.వెంకట్ రెడ్డి, లక్ష్మణ్ రాజ్, వెంకటేష్, నాగరాజు, శ్రీకాంత్, శేఖర్, నరేష్,జంగయ్య, శ్రీను పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

-ఆర్డీఓకు ముస్లిం మైనారిటీల వినతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ముస్లిం మైనారిటీ నాయకుడు, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు హబీబ్ ఉర్ రహ్మాన్ ఆధ్వర్యంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జామా మస్జిద్ నుంచి ఆర్డిఓ కార్యాలయం వరకు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ముస్లింలకు మద్దతుగా బీఎస్పీ పార్టీ నాయకులు మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నాను ఉద్దేశించి ముస్లిం మైనారిటీ నాయకులు హబీబుర్ రెహమాన్, మహమ్మద్ హబీబ్ ఖాన్, ముస్లిం హక్కుల సాధన సమితి అధ్యక్షుడు మహమ్మద్ నిజాం, వక్ఫ్ కాంప్లెక్స్ కమిటీ కార్యదర్శి పఠాన్ అబ్దుల్లా ఖాన్, జామ మస్జిద్ కమిటీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఖాదర్, ముస్లిం సంఘాల పెద్దలు మహమ్మద్ సాధిక్ పాషా, యాకుబ్ బావజీర్, మహమ్మద్ ఖాజా బాబా,బి.ఎస్.పి నాయకుడు పృథ్వీ తదితరులు మాట్లాడుతూ ముస్లింల హక్కులను కాలరాయడానికి కేంద్రంలోని బిజెపి, దాని భాగస్వామ్య పక్షాల ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. దేవుడికి అంకితం చేస్తూ ముస్లిం దాతలు ఇచ్చిన భూములు వక్ఫ్ బోర్డు పరిధిలో అనాదిగా ఉన్నాయన్నారు. వక్ఫ్ ఆస్తులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ముస్లింలపై ద్వేషంతో బడా బాబులకు అంటగట్టడానికి చట్టంలో మార్పులు తీసుకొని వస్తుందన్నారు. ఇప్పటికే ముంబై లాంటి ప్రధాన పట్టణాలలో బడాబాబులు వక్ఫ్ భూములను కబ్జా చేసి ఆకాశ హార్మ్యాలను నిర్మించుకున్నారని ఆరోపించారు. దేశంలో వక్ఫ్ భూములను అనేక మంది ముస్లిం యేతరుల కబ్జాలలో ఉన్నాయని వాటిని స్వాధీనం చేసుకోవడానికి ఈ బిల్లు దోహదం చేస్తుందని వారు ఆరోపించారు. అనేకమంది దాతలు అనాదిగా ముస్లింల సంక్షేమం కోసం "వక్ఫ్" అంటే అల్లా మార్గంలో దానం చేయడం జరిగిందన్నారు. పేదల అభ్యున్నతి ముస్లింల సంక్షేమం కోసం ఈ భూములపై వచ్చే ఆదాయాన్ని వినియోగించడమే కాకుండా ఖబ్రస్తాన్, మస్జిద్, మదార్సలు, అనాధ ఆశ్రయాలు, నిరుపేదల విద్యా కోసం, ముస్లింలలోని పేదలు వ్యాపారాలు చేసుకోవడానికి ఇట్టి భూములను వినియోగించు కోవడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. బిజెపి తీసుకువచ్చిన ఈ బిల్లును దేశంలోని ముస్లిం యేతరులు సైతం వ్యతిరేకిస్తున్నారన్నారు. దీనికి ప్రత్యక్ష నిదర్శనం పార్లమెంట్ లో పెద్దల సభలో చర్చ సందర్భంగా ఎంపీలు రాజ్యసభ సభ్యులు మాట్లాడిన మాటలే నిదర్శనం అన్నారు. అనంతరం ఆర్డీవోకు వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేస్తూ చట్టం రూపు దాల్చకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందించారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీలు, వక్ఫ్ కాంప్లెక్స్ కమిటీ బాధ్యులు, మస్జిద్ కమిటీల బాధ్యులు, ముస్లిం సంఘాల బాధ్యులు, బహుజన సమాజ్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

## సీతమ్మ వారికి వెండి కిరీటం బహుకరణ

**వంగూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** శిర్సనగండ్ల గుట్టపై వెలసిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉన్న సీతమ్మ వారికి రూ.40వేలువిలువ చేసే వెండికిరీటాన్ని సీతమ్మ వారికి చారకొండ గ్రామానికి చెందిన బొడ్డు నవీన్ కుటుంబ సభ్యులు బహూకరించారు. అమ్మవారికి వెండి కిరీటాన్ని అందించిన బొడ్డు నవీన్ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో మెలగాలని ఆలయ అర్చకులు లక్ష్మణ్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**భూత్పూర్,ఏప్రిల్ 4,ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణ కేంద్రంలోని సాహితీ కాన్సెప్ట్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.డీఈఓగా సులేమాన్, ఎంఈఓగా ఆమని,ప్రిన్సిపాల్‌గా సోహెబ్,ఉపాధ్యాయులుగా శ్రీజ,భవ్య,పాక్షిత,రూపలు చక్కగా అభినయించారు.వివిధ హోదాలలో చక్కగా నటించిన విద్యార్థిని విద్యార్థుల్ని పాఠశాల కరస్పాండెంట్ ఎం సత్యనారాయణ(సత్యం)తో పాటు పాఠశాల ఉపాధ్యాయురాళ్లు అభినందించారు.

## బిజెపి నేతల ముందస్తు అరెస్టు

**చిన్న చింతకుంట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా బిజెపి నేతలను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు నంబి రాజు, కురవ రమేష్ లంకాల రవిలు మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీలో కేంద్రం వాటా ఉందని రేషన్ దుకాణంలో ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ముందస్తుగా అరెస్టు చేయడం సరైనది కాదని వారు తెలిపారు. అనంతరం సాయంత్రం పోలీసులు సొంత పూచికత్తుపై బిజెపి నేతలను విడుదల చేశారు.

## సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులను ప్రారంభించిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు

**భూత్పూర్,ఏప్రిల్ 4,ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపాలిటీలోని రెండో వార్డు శేరుపల్లి(బి)లో శుక్రవారం సీసీ రోడ్లు,డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే జీఎంఆర్ ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ శుక్రవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌కుమార్‌గౌడ్, మండల కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు జైదు శ్రీనివాసులు, మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జమీర్‌తో పాటు నాయకులు నిమ్మల సాయిరాం యాదవ్,బోరింగ్ నర్సింహులు,లిక్కి రాజేష్‌గౌడ్,కోరె పవన్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ట్విన్నింగ్ స్కూల్ ప్రోగ్రామ్.. విద్యార్థుల భవిష్యత్‌కు దిశానిర్దేశం

**ఉప్పునుంతల, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** విద్యాశాఖ కార్యాచరణలో భాగంగా ఉప్పునుంతల మండల పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలల 5వ తరగతి విద్యార్థులకు ఒక ప్రత్యేక కార్యక్రమంగా ట్విన్నింగ్ స్కూల్ ప్రోగ్రాంను శుక్రవారం మండల కేంద్రంలోని పీఎం శ్రీజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మండల విద్యాధికారి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పాఠశాలల అనుసంధానంతో విద్యార్థుల్లో విజ్ఞాన అభిలాష పెరుగుతుందని ఆయన వివరించారు.విద్యార్థులు తదు పరి విద్యా దశలో ఎదురయ్యే బోధనా విధానం, వనరులు, పాఠశాల వాతావరణం పై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎంఇఓ చంద్రశేఖర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, మండలంలోని అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు నూతనమైన విజ్ఞానాభిలాష, భవిష్యత్ విద్యా పథంలో స్పష్టత కలుగుతుందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.

## బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు డాక్టర్ రాంబాబు, జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, పట్టణ అధ్యక్షుడు మురళి భట్టాడ్ కోరారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని గొడుగుగేరి అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఏప్రిల్ 6 ఆదివారం ఉదయం 9.45 నిమిషాలకు పళ్ల హనుమాన్ మందిర్ నుండి పురవీధుల గుండా ర్యాలీ ఉంటుందని ర్యాలీ చివరకు బ్రాహ్మణవాడి రామ్ మందిర్ వద్ద ముగుస్తుందని హిందూ బంధువులు అధిక సంఖ్యలో హాజరై ఐక్యతను చాటి విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కడుదాసు ప్రవీణ్, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక వడ్ల శ్రావణ్ కుమార్, పట్టణ అధ్యక్షులు వెంకటేష్, చెన్నారెడ్డి, ఆకాష్, రాఘవేంద్ర, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు స్ప్రింక్లర్ల పైపుల పంపిణీ

**వంగూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** రైతులు వ్యవసాయ సాగుపై ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటూ దేశానికి అన్నం పెడుతున్నారని అలాంటి రైతన్నకు సబ్సిడీ ద్వారా వ్యవసాయ పనిముట్లు అందించి వ్యవసాయ అభివృద్ధిని పెంపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని కల్వకుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పండిత్ రావు పేర్కొన్నారు సేద్యం చేస్తున్న రైతన్నలకు వ్యవసాయ పనిముట్లను కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు కలగకూడదని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా స్ప్రింక్లర్లను అందిస్తుందన్నారు. శుక్రవారం వంగూరు మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సబ్సిడీ ద్వారా మంజూరైన స్ప్రింక్లర్ పైపులను రైతులకు అందించారు. సబ్సిడీ ద్వారా వ్యవసాయ పనిముట్లు తీసుకునేందుకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లు అందిస్తుందని వ్యవసాయ పనిముట్లు కావలసిన రైతులు సంబంధిత వ్యవసాయ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్టికల్చర్ ఏఓ మహేశ్వరి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, డీలర్ బుచ్చి రాములు, చంద్రశేఖర్, గఫూర్ తదితరులున్నారు.

## ఉప్పునుంతల పాఠశాల విద్యార్థులకు గురుకులాల్లో సీట్లు

**ఉప్పునుంతల ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు 5వ తరగతి గురుకుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష 2025 ఫలితాల్లో విశేష ప్రతిభను కనబరిచారు. పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు వివిధ గురుకుల విద్యా సంస్థల్లో సీట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ , గాజుల వెంకటేష్ తెలిపారు. పాఠశాల నుంచిఆలూరి అక్షర, బొల్లె తన్వి బాలికల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల మన్ననూర్, ఆలూరి పూజిత సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల వంగూర్,ఎదురిశెట్టి కీర్తన మహాత్మా జ్యోతి బాపూలే బి.సీ గురుకుల పాఠశాల మక్తల్, ఇప్పటి భవ్యశ్రీ సాధారణ గురుకుల పాఠశాల బోర బండ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో సీట్లను సాధించినట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాసులు ఉపాధ్యాయులు వెంకటేష్ , చందన , సంగీతలు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులుబాగా చదువుకొని భవిష్యత్తులో గొప్ప స్థాయికి ఎదగాలని,సమాజ అభివృద్ధికి వారు తమ కృషిని అంకితం చేయాలని వారు ఆకాంక్షించారు. తమ పిల్లల గురుకుల పాఠశాలలో సీట్లు సాధించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ, పాఠశాల ఉపాధ్యాయులను వారు ప్రత్యేకంగా అభినందించారు.గురుకుల పాఠశాల లో సీట్లు సాధించిన విద్యార్థులను మండల విద్యా శాఖాధికారి చంద్రశేఖర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డిలు ప్రత్యేకంగా విద్యార్థులను అభినందించారు.

## బీసీ కులాల ఐక్యత చారిత్రక అవసరం

**బిజినేపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** బీసీ కులాలలో ఐక్యత లేకపోవడంతో అగ్రవర్ణాలు అదునుగా భావించి అనిచివేస్తున్నాయి ఐక్యంగా ఉద్యమించి బీసీల సత్తా చాటాలని యాదవ సంఘం రాష్ట్ర నాయకులు బైకని శ్రీనివాస్ యాదవ్, ముదిరాజ్ సంఘం నాయకులు గంగన మోని కిరణ్ పిలుపునిచ్చారు. మంగనూరు గ్రామంలో శుక్రవారం బీసీ కులాల పెద్దలతో సమావేశం నిర్వహించారు. బిజినపల్లిలో 9వతేదీన నిర్వహించే మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సబండవర్గాలు విజయవంతం చేయాలని కోరారు. కులసంఘాలు, రాజకీయ సంఘాలకు అతీతంగా బీసీలంతా ఐక్యమైతే భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఆనాడు బీపీ మండల్ కమిషన్ అమలై ఉంటే ఈనాడు మన తలరాతలు మారేవని వారు వివరించారు.పాలకుల ఆట కట్టించాలంటే బహుజన రాజ్యంకోసం కలిసి పోరాటం చేయాలన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే చూపిన సనాతన విధానాన్ని అవలంభించాలన్నారు. దంచుడు కొట్టుడు నరుకుడు కాకుండా ఆచరణాత్మక తీర్మానాలతో రాజ్యాధికారం దిశగా అందరం నడుద్దామని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా బీసీలు ఉన్నా కూడా ఐదు శాతం ఉన్న అగ్రవర్ణాలే ఉన్నత పదవుల్లో కొనసాగుతూ బీసీలను అణచివేస్తూ ఆర్థికంగా అనుగదొక్కుతున్నారన్నారు.అప్పుడే మహనీయులు కన్న కలలు నిజమవుతా యని అన్నారు. కార్యక్రమంలో వేముల తిరుపతయ్య సత్యశీల సాగర్ వేముల సత్యం గడ్డపార శివ బోట్కు చంద్రశేఖర్ జహంగీర్ బోల్ల కృష్ణయ్య జాలం తిరుపతయ్య యాదవ్ సల్ల భీమయ్య మల్లేష్ పరశురాములు వాళ్ల పేరు తిరుమల్ వంక వెంకటయ్య జాలం ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**లింగాల, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** బ్యాంకు పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం లింగాల కౌన్సిలర్ శ్రీశైలం అన్నారు. శుక్రవారం లింగాల మండల పరిధి లోని అవుసలి కుంట గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకు ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాల భీమా సౌకర్యాలపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల లోపు ఉన్నవారు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, 18 నుంచి 70 సంవత్సరాల లోపు ఉన్నవారు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు వివరాలు వంటివి అడిగితే చెప్పవద్దని అన్నారు.కార్యక్రమంలో కౌన్సెలర్లు ఎండి మన్సూర్, రూపేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేష్ ఉన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

**లింగాల, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటన లింగాల మండలంలోని కొత్తకుంటపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం కొత్తకుంటపల్లి గ్రామానికి చెందిన సొడమోని శ్రీను, అలివేల దంపతుల కుమారుడు మధు (22) బుధవారం ద్విచక్ర వాహనంపై మధు,సాయి ఇద్దరు కలిసి తన స్వగ్రామం అయిన కొత్తకుంటపల్లి నుండి అంబట్ పల్లికి వరి కోత మిషన్ కోసం వెళ్తుండగా మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొనడంతో మధుకు చాతీకి, తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్ కి సమాచారం ఇవ్వడంతో అక్కడ నుంచి నాగర్ కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నాగర్ కర్నూల్ ఏరియా ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి 10.30 సమయంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసికొని ధర్యాపు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

**గ్రామంలో విషాదం:** గ్రామంలోని శ్రీను,అలివేల ఏకైక కుమారుడు మధు మృతి చెందడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. మధు మృతదేహాన్ని చూసి ఒకనోక కొడుకు చనిపోయడాన్ని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## నాటు కోళ్లను చంపిన గుర్తు తెలియని వ్యక్తులు

**లింగాల, ఏప్రిల్4 ప్రభాతవార్త:** వ్యవసాయ పొలంలో ఉన్న నాటుకోళ్లను గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసి చంపేసిన సంఘటన లింగాల మండలంలోని కోమటికుంట గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత రైతు దేశామోని నిరంజన్ తెలిపిన వివరాల ప్రకారం నిరంజన్ గ్రామ శివారులోని తన వ్యవసాయం పొలంలో చిన్న నాటు కోళ్ళ షెడ్డు ఏర్పాటు చేసి నాటు కోళ్ళను పెంచుతున్నాడు. గురువారం రాత్రి సమయంలో పొలంలో కోళ్లను, జాలిలో ఉంచి ఇంటికి వెళ్ళాడు. శుక్రవారం ఉదయం పొలం దగ్గరకు వెళ్లి చూసేసరికి కోళ్లు కిందపడి, జాలి తెగిపొయి 15 కొళ్ళు గొంతుకోసి కింద పడి ఉన్నాయి. గత మార్చి నెలలో కూడా 60 నాటు కోళ్లను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.15 రోజుల వ్యవధిలోనే రెండు సార్లు ఈ సంఘటన జరిగినట్లు తెలిపారు. ఇట్టి విషయంపై పోలీసులను వివరణ కోరగా మాకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**కృష్ణ, ఏప్రిల్4 ప్రభాతవార్త:** ఐకేపీ ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ బి. వెంకటేష్, ఎంపీడీవో జానయ్య, ఏవో సుదర్శన్ గౌడ్ ఏపీఎం బసవరాజ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుడెబల్లూర్, మురహరదొడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలన్నారు. క్వింటాలుకు ఏ గ్రేడ్‌ధాన్యం రూ. 2320, బీగ్రేడ్ ధాన్యంరూ. 2300 రేటును నిర్ణయించిందన్నారు. దీంతోపాటు రాష్ట్రప్రభుత్వం 500 చొప్పున బోనస్ ఇస్తుందని రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని నాణ్యతగా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని అన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, రాకేష్, వీవోఏలు, గ్రామ సంఘం అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

## బిజెపి ఆవిర్భావ దినోత్సవం..
## అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

**వనపర్తి రూరల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** శుక్రవారం పట్టణంలోని లక్ష్మి కృష్ణ గార్డెన్‌లో బిజెపి రాష్ట్ర నాయకులు సిహెచ్. రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా జిల్లా పదాధికారుల సమావేశంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ ఆరవ తేదీ నుంచి 13వ తేదీ వరకు బిజెపి ఆవిర్భావ దినోత్సవం మరియు అటల్ శతజయంతి ఉత్సవాలు నిర్వహించాలని అలాగే ఏప్రిల్ 14వ తేదీ నుండి 25వ తేదీ వరకు డా. బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణ, ప్రధానమంత్రి పేద ముస్లింల అభ్యున్నతిపై తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుపై జన జాగరణ కార్యక్రమం,వన్ నేషన్ వన్ ఎలక్షన్ యోజనపై మేధావులతో సమావేశం నిర్వహించాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బిజెపి జాతీయ, రాష్ట్ర పార్టీల సూచన మేరకు ప్రతి బూత్ స్థాయి నుండి జిల్లా స్థాయి నాయకులందరూ విధిగా పాల్గొనాలని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ, సి.రాజేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్, జిల్లా పదాధికారులు,మండల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

■మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి


చంద్ర గట్టు గ్రామంలో సన్నబియాని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**అమరచింత, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ జయముగా ముందుకు వెళతున్నామని మక్తల్ ఎమ్మెల్యే, డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం అమరచింత మండలంలోని చంద్రఘడ్ గ్రామంలో పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ తో కలిసి సన్నబియ్యాని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోనే తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం శుభ సూచకమని ఆయన అన్నారు. చంద్రఘడ్ గ్రామ రైతులకు 2కోట్ల 26 లక్షలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసిందని అలాగే చంద్రఘడ్ లిఫ్టు అభివృద్ధికి 26 లక్షలు నిధులు మంజూరు చేసి రైతులకు సాగునీరు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాని దేనని ఆయన అన్నారు. అలాగే రేషన్ కార్డులు లేని వారు రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తుందని హారులైన వారు దరఖాస్తు చేసుకోవాలని,ఆయన తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో సిసి రోడ్లు పనులు జరుగుతున్నాయని సిసి రోడ్ల పనులను కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, కేజీ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణఅధ్యక్షుడు, అరుణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీలు మహంకాళి విష్ణు, తిరుమలేష్, పోసిరి విష్ణు, హనుమంతు నాయక్, లక్ష్మి కాంత్ రెడ్డి, రాకేష్ గౌడు, హరీష్ నాయక్, చంద్రఘడ్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందజేస్తాం

■అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు


సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

**అలంపూర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పూర్తి స్థాయిలో అందజేస్తామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండలం రామాపురం, రాజోలి మండల కేంద్రం అలాగే అయిజలోని సంకాపురం గ్రామంలో ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడతానని ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని పూర్తి స్థాయిలో ప్రజలకు అందజేస్తామని తెలిపారు. ఈ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వడ్డేపల్లి మండల ఇన్చార్జి తహసిల్దార్ వీరభద్రప్ప, సివిల్ సప్లై ఎన్ ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాసిల్దార్ ప్రశాంత్‌గౌడ్,అయిజ మండల సింగిల్‌విండోమాజీచైర్మన్ సంకాపురం రాముడు,మాజీ జెడ్పిటిసి నరసిం హారెడ్డి,అయిజ మండల బిఆర్ ఎస్ పార్టీ ఇంచార్జీ వావిలాల రంగా రెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షులు గోపాల్,మాజీ ఎంపీపీ సుందర్రాజు, భద్ర య్య,నరసింహారావు, ఉమేష్‌గౌడ్ బ్రహ్మయ్య,మాల వీరేశ్, బిఆర్ ఎస్వి బింగిదొడ్డిముత్తావలి, రెవెన్యూసిబ్బంది,ఆయాగ్రామాలడీలర్లు ,పాల్గొన్నారు.

**సీఎంఆర్ ఎఫ్ చెక్కులు అందజేత:** రాజోలి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి మంజూరు అయిన సీఎంఆర్ ఎఫ్‌చెక్కులను ఎమ్మెల్యే విజయుడు అందజేశారు.

# ఊరురా పండగలా రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ

■ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేసిన అధికారులు, కాంగ్రెస్ నాయకులు



కొండేరు, పుటాన్ దొడ్డిలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఇటిక్యాల, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం తెల్ల కార్డుదారుల పేద ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గత నెల 30వ తేదీన ప్రారంభించారు. అందులో భాగంగా ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం 2 వ రోజు మండల పరిధిలోని కొండేరు గ్రామంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు కాంగ్రెస్ ముఖ్య నాయకులు పోతురాజు సోమనాద్రి, ఆర్ఐ షంషీర్ ఆధ్వర్యంలో పేదలకు సన్న బియ్యం పంపిణి కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అదేవిధంగా పుటాన్ దొడ్డి శాసనూలు, అర్.గార్లపాడు గ్రామాలలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహారెడ్డి, ఆర్ఐలుషంషీర్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో రేషన్ షాపులలోని తెల్ల కార్డుదారుల పేద ప్రజలకు వారు సన్న బియ్యం పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా మొగలి రావల్ చెరువు, ఇటిక్యాల గ్రామాలలోఅర్ఐ మదన్ మోహన్, జూనియర్ అసిస్టెంట్లు అలీభాష, రఘు ఆ గ్రామాల డీలర్లతో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతేకాక షాబాద్, బుడ్డారెడ్డి పల్లి గ్రామాలలో ఏఎస్ఓ హుస్సేన్, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ ఆ గ్రామాల డీలర్లతో కలిసి తెల్లకార్డుదారుల పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణికార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శేఖర్‌రెడ్డి, యువరాజు, అల్లబకాష్, ఈదన్న, మంద శంకర్, బిసన్న, నరసింహులు, బీమపల్లి, నారాయణ, సవరన్న, జాకీర్ పాషా, యోహాన్, ప్రతాప్ నాయుడు, లక్ష్మన్న, రాముడు, మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు యుగంధర్, యుగంధర్ రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

# బడుగుల అభ్యున్నతే లక్ష్యం

◆ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పండిత్ రావు


సన్నబియ్యం రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

**వంగూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజలకు సన్న బియ్యం అందించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతుందని కల్వకుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పండిత్ రావు అన్నారు. శుక్రవారం వంగూరు మండల కేంద్రంలోని 3వ రేషన్ షాప్ దగ్గర ప్రభుత్వంఅందించిన సన్నబియ్యాన్ని కల్వకుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, వంగూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పండిత్ రావు, తహసీల్దార్ మురళి మనోహర్‌లుప్రారంభించారు.ఈ సందర్భంగా పండిత్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి బడుగులకు అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ కాంగ్రెస్ పార్టీ అంటేనే పేద ప్రజల పార్టీ అని నిరూపిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, మండల వర్కింగ్‌ప్రెసిడెంట్, మాజీఎంపీటీసీ బాధమోని రమేష్ గౌడ్, టౌన్ అధ్యక్షులు గఫూర్, డీలర్ల సంఘం అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, డీలర్ లక్ష్మయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు అధికారులు పాల్గొన్నారు.

## కష్టాలను ఎదుర్కొని లక్ష్యం సాధించాలి

అవగాహన సదస్సులో సరోజ గుల్లపల్లి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైన అనుకున్న లక్ష్యం సాధించాలని, సీ గల్ పక్షి జాతిని ఆదర్శంగా తీసుకోవాలని సరోజ గుల్లపల్లి విద్యార్థులకు సూచించారు. పాలమూరు యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్ర విభాగం విద్యార్థులకు రిచర్డ్ బాక్ రచించిన నవలలో జోనాథన్ లివింగ్‌స్టన్ సిగల్ అనే అంశం పై సరోజ గుల్లపల్లి (బియాండ్ యువర్ మైండ్స్ వ్యవస్థాపకరాలు, మెల్‌బోర్న్, ఆస్ట్రేలియా) ఆన్లైన్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీ గల్ పక్షులలో సోమరితనం ఉంటుందని, మందకు (లేజినెస్) వ్యతిరేకంగా వెళ్లాల్సిన అవసరం ఉన్నప్పటికీ, స్వేచ్ఛగా ఎగరడం పట్ల తన కున్న మక్కువను అవిశ్రాంతంగా కొనసాగించడం ద్వారా నిజమైన స్ఫూర్తిని పొందవచ్చున్నారు. ఒత్తిళ్లు లేదా సామాజిక నిబంధనలతో సంబంధం లేకుండా, అభిరుచికి అనుగుణంగా లక్ష్యం సాధించాలన్నారు. మనం నేర్చుకున్న జ్ఞానాన్ని పది మందికి పంచితే జ్ఞానం రెట్టింపు అవుతుందని అన్నారు. అవగాహన కార్యక్రమంలో విభాగాధిపతి డా రవికుమార్, అధ్యాపకులు డా సిద్దరామ గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సరోజ

## గ్రామాలలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభం


వెల్టూర్‌లో ఉచిత సన్న బియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

**ఉప్పునుంతల, ఏప్రిల్ 4ప్రభాతవార్త:** మండలంలోని పలు గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం పలు గ్రామాలలో ప్రారంభించారు. శుక్రవారం మండలంలోని వెల్టూర్ లో షాప్ నెంబర్ 6,7 రేషన్ షాపు, కొరటికల్ షాప్ నెంబర్ 19లో తహసీల్దార్ ప్రమీలచే ప్రారంభించారు.అదే విధంగా తాడూరు, పెనిమెళ్ల గ్రామాలలో ఉచిత సన్న బియ్యం పథకం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రమీల మాట్లాడుతూ రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఉచిత సన్న బియ్యం పథకాన్నిసద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రమీల సూచించారు. అనంతరం పలువురు ప్రసంగించారు. వెల్టూర్ లో తహసీల్దార్ ప్రమీలను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రమీల, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, రేషన్ డీలర్లు మల్లయ్య, గున్నమోని సునీత, సత్యనారాయణ, సింగిల్ విండో వైస్ చైర్మన్ గంట కురుమయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ రెడ్డి రెడ్డి రంగారెడ్డి, గోపిరెడ్డి రఘుపతి రెడ్డి, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపిరెడ్డి రమేష్ రెడ్డి ,మాజీ సర్పంచులు గున్నమోని లింగమయ్యయాదవ్,రాగి వేణుగోపాల్‌రెడ్డి, యాదవ రెడ్డి ఊర్మిళ, లక్ష్మయ్య,విశ్రాంతి రెవెన్యూ అధికారి లింగమయ్య గౌడ్, ఎస్సీ సెల్ నాయకులు గుద్దటి బాలరాజు, పద్మనాభ రెడ్డి, గోస్కె బాల్ రాజ్, బాలస్వామి,జంగ రావు, నాగార్జున, బాల్ రెడ్డి, సైదులు, కళావతమ్మ, కాటమయ్య, రాజమౌళి, కృష్ణ రెడ్డి, రాజు, స్వామి, జైపాల్ రెడ్డి, గోపిరెడ్డి వెంకట్ రెడ్డి, వెంకటయ్య,లింగమ్మ, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**మహబూబ్‌నగర్ ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** పాఠశాల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ లైన్ పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు సంబంధించిన నూతనంగా పదోన్నతి పొందిన ఎస్ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్) వ్యాయామ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏఎంఓ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు అనుకుంటే పాఠశాల స్థాయి నుంచి చక్కని క్రీడాకారులని రాష్ట్ర స్థాయికి పంపే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విద్యలో వస్తున్న మార్పులు మరియు ఆటలలో వస్తున్న కొత్త రూల్స్ గురించి డిఆర్పీలు వివరించారు. ఈ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్ గా స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయశ్రీ వ్యవహరించారు. డిఆర్పీలు గా వడన్న, రాజవర్ధన్ రెడ్డి తోపాటు శిక్షణకు ఉమ్మడి జిల్లా నుంచి 206 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీ

**వెల్దండ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం రాష్ట్రం నెంబర్‌వన్‌గా నిలుస్తుందని వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమ మనీలా సంజీవ్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్‌లు పేర్కొన్నారు. వెల్దండ మండలంలోని బండోనిపల్లి గ్రామంలో తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి నిరుపేద కుటుంబానికి సన్న బియ్యం ఉచితంగా అందివ్వాలని రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగాలబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వచ్చిన అనతి కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్ర అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తారని,అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పర్వత్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శంకరయ్య, ఆర్ఐ శంకర్ తదితరులు ఉన్నారు.

**బిజినేపల్లి ఏప్రిల్4 ప్రభాతవార్త:** దేశంలోనే తొలిసారిగా ఆహార భద్రత కార్డు కలిగిన నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు మూడవత్ గోవింద్ నాయక్ అన్నారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి సూచన మేరకు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులుసంయుక్తంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు చందులాల్ నాయక్, పాండునాయక్ ,కృష్ణా నాయక్, వెంకటయ్య,తిరుపతి రెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి, చంద్రగౌడ్,రామ్‌చందర్, వెంకటస్వామి,శ్రీనివాస్ యాదవ్,పూల్యానాయక్, యాదయ్య, మహేష్, రాజేష్ కుమార్, సుధాకర్‌రెడ్డి గ్రామపెద్దలు, కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు.

**మద్దూర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూరు మండలపరిధిలోని బీంపురం, పర్స పూర్, మెడికుంటతాండ, పల్లెర్ల గ్రామాలలో శుక్రవారం పంపిణీ చేశార. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగిల్ విండో చైర్మన్ గుల్ల నరసింహ, మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల 85 లక్షల మంది లబ్ధిదారులకు ఒక కోటి 81 లక్షల 676మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ప్రతి కుటుంబంలోని సభ్యులకు ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేయడానికి పూనుకున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని అన్నారు. పంపిణీలో అవకతవకలు జరిగితే సహించేది లేదని అన్నారు. పేద ప్రజలకు సన్నబియ్యాన్ని అందించేందుకే రైతులు పండించిన సన్న వడ్లకు 500 బోనస్ ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ తదితరులు ఉన్నారు.

**చిన్న చింతకుంట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సన్న బియ్యం పథకం నిరుపేదలకు వరం లాంటిదని శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థాన చైర్మన్ గొని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామంలో రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం నిరుపేదల అండగా ఉంటూ వారి కడుపు నింపేందుకు సన్నబియ్యాన్ని అందిస్తుందన్నారు. పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్నప్రజా ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిరుపతిరెడ్డి ,పార్టీ గ్రామ అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఎంపిటిసి గొల్ల సత్యం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేవైఎం నాయకుల అరెస్టు

**బాలానగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వెయ్యడాన్ని వ్యతిరేకిస్తూ, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేందర్ పిలుపు మేరకు మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనానికి వెళ్లిన బీజేవైఎం మండల నాయకులను బాలానగర్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగాబీజేవైఎం నాయకులు మాట్లాడుతూ హెచ్‌సీయు యూనివర్సిటీ భూములను అమ్మడం అప్రజాస్వామికమన్నారు. యూనివర్సిటీ భూములను వేలం వేయడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులుకుమార్ నాయక్, శ్రీను నాయక్, ఆర్య నాయక్,రమేష్ నాయక్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**కల్వకుర్తి, ఏప్రిల్4 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని 2వ వార్డులో ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణ రెడ్డి సహకారంతో మంజూరైన సీసీ రోడ్డు పనులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డిలు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో కల్వకుర్తి పట్టణం అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. మున్సిపాలిటిలోని అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుడుముల చంద్రకాంత్ రెడ్డి, వ్యవసాయ నాయకులు జమ్ముల శ్రీకాంత్, పాండురంగారెడ్డి, ఆంజనేయులు, శ్రీకాంత్,కాలనీవాసులు పాల్గొన్నారు.

## ధ్వజస్తంభ ప్రతిష్ట
## కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్4, ప్రభాతవార్త :** శివాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం గోపాల్‌పేట మండలం ఏదుట్ల గ్రామంలోని నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయలు కొట్టి నైవేద్యం సమర్పించిన ఎమ్మెల్యే ప్రత్యేక హారతులు ఇచ్చి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ సత్య శీలారెడ్డి, జయపాల్ రెడ్డి, వెల్టూరు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నాగిరెడ్డి, కొంకి వెంకటేష్, సురేష్ గౌడ్, రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.